# బేగడ

అతని భార్య చనిపోయి చాలా కాల మయింది. ఐనా శేషావతారం మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. అతని బంధువులు చాలా ప్రయత్నాలు చేశారు, అతనికి మళ్ళీ పెళ్ళి చేద్దామని. వాళ్ళ ప్రయత్నాలు చూస్తుంటే అతనికొక దూరూహ తట్టింది. వీళ్ళందరూ యెందుకు తనమీద యిట్లాంటి ఆపేక్షలు ప్రదర్శించటం? తను పెళ్ళి చేసుకోడు, చేసుకుంటాడు. చస్తాడు. బైరాగుల్లో కలుస్తాడు. ఏమిటి వీళ్లకు సంబంధం? ఒకవేళ...ఏమో? అదేనేమో మరి? ఎట్లా కాదనటం? తను అంత నీచుడా? అట్లా కామానికి లొంగుతాడా? ఒకవేళ 'కాలుజారితే' మట్టుకు? ఎందుకు పనికొస్తారు, గట్టిగా పట్టుకొంటే నైనంలాగు మెత్తపడే వీళ్ల ఆడవాళ్లు.

ఇంకో స్త్రీని చూసినప్పుడల్లా, అతనికి చప్పున భార్య జ్ఞాపక మొచ్చేది. దిగులు వేసేది. ఆమెను తలచుకొని గొప్పగా విచారించాడు. అతని భార్యా ప్రేమను చూసినవారల్లా, దేవుడికి బుద్ధిలేదని బహిరంగంగా తేల్చేశారు. ఏమాత్రం బుద్ధివున్నా ఆ భార్యను చంపి, అతనికీ వియోగం కలిగించక పోయేవాడే మరి. భార్య దిగులు మాయటానికి బదులు అతనికి రోజురోజుకూ అధికమవసాగింది. ఆ దుఃఖం పగటికంటే రాత్రులు మరీ ఎక్కువగానూ, గాఢంగానూ వుండేది. ఇదివరకు భార్యతో, ఒరుసుకొని పడుకొనే ఆచారాల పరుపుమీద ఇప్పుడు వొంటరిగా పడుకోలేక పోతున్నాడు. భార్య చనిపోయినమాట నిజం. కానీ ఆ భార్య తీర్చవలసిన అతని అవసరం మాత్రం చావలేదు. ఆమెమీద 'ప్రేమ' చూపించేవాడు శారీరకంగా. ఇప్పుడు ఎవరూ దొరకటల్లేదు. అట్లా తన ప్రేమను తెల్లవార్లూ నల్లులు ఏరుకుంటూ భరించటానికి ఆపరుపుమీద కొంతకాలం పుస్తకాల మీదకు మనస్సు తిప్పాడు. లాభంలేకపోయింది. ఎక్కడో తప్పక ఈ 'ప్రేమ' విడుదల కావాలి. అది శరీరంలో వున్నంతకాలం వున్మాదంగానూ, మత్తుగానూ, వుంటోంది. ఏ పనిచేద్దామన్నా 'ఆ బొమ్మ' కళ్ళముందు మెదులుతుంటుంది. పార్టీలను అంతగా చూడటల్లేదు. ముఖ్యమైన పనులన్నీ ఆంజనేయులకు

గొప్ప చెప్పాడు. అతను అన్నీ సిద్ధంచేస్తే, శేషావతారం పూరికే చక్రం తిప్పేవాడు...

ఇది కొంతకాలం కిందటి సంగతి. ఆ తరువాత శేషావతారం తన మనస్సు మార్చుకొన్నాడు. భార్య లేకుండా బ్రతకటం అసంభవం అని తేల్చుకున్నాడు. ఇట్లా తేల్చుకోవటానికి ఆధారం లేకపోలేదు. ఇంట్లోపనికి సూరమ్మను కుదిర్చాడు. అన్నం తనే వండుకునేవాడు. బి. ఏ. బి. యల్. చదివినా ఆయన ప్రతి రక్తకణమూ, హైందవత్వంతో విలసిల్లుతూ వుంటుంది. ఇంగ్లీషు భాషాభ్యాసం తాలూకు 'చిల్లర' వేషాలు ఆయనకు పట్టుబడలేదు. ప్రతిరోజూ దేవతార్చన చేస్తాడు. పట్టుపంచ కట్టుకొనిగానీ, భోజనం చెయ్యడు. హోటల్లోకి పోనేపోడు. పొరుగూరు వెళితే వండుకునేవాడు. వీల్లేకపోతే, మజ్జిగో, పాలో 'అటుకులో' తినేవాడు. వంటమనిషిని పెట్టుకోవచ్చు. ఆవిడది, అతనికి కావలసినంత పరిశుభ్రమైన, మడి కాకపోవచ్చు. మరి—సూరమ్మను చూస్తుంటే, ఆయనకు తనలో ఏదో చలనం కలుగుతున్నట్టుండేది. ఆ చలనం అతనికి గొప్ప సంతోషదాయకంగానూ ఉండేది. సూరమ్మ మొగుడు దాన్ని వదిలి, యుద్ధంలో కెళ్ళాడు. కొంత కాలంపాటు అది సహోజనానికి మరపలు పిల్ల. శేషావతారంగారికి దాని శరీరంలో పవిత్రత గోచరించింది. ఒకరోజు రాత్రి ప్రొద్దుపోయి రమ్మని, అది వచ్చిన తర్వాత...అంతే! అందులో దోషం లేదు. సూరమ్మ చేతి నీళ్ళు దోషం. అది వంటింటోకి రావటం దోషం. అది తోమిన అంట్లు, నీళ్ళ చల్లక తీసుకోవటం దోషం. అది విడిచిన గుడ్డలు మజ్జిగ శుద్ధి కాకుండా ముట్టుకోవటం దోషం. కానీ పక్కలమీది అవసరానికి అది దోషం కాదు. ఆ సమయంలో, దాని చెమట దోషంకాదు పన్నీరు. దాని పెదిమ చొంగ ఎంగిలి కాదు అమృతం, ప్రతి అవయవమూ, ప్రత్యవయవంతో మెలుచుకు పోవటం దోషం కాదు, శేషావతారంగారికి. ఆయన ప్లీడరు హృదయంలో, ఈ తప్పు ఏ సెక్షను క్రిందికీ రాలేదు మరి...

ఇది కొంతకాలం క్రిందటి సంగతి. ఆ తర్వాత శేషావతారం తన మనస్సు మార్చుకున్నాడు. ఎంతకాలం పరాయి ఆడవాళ్ళతో తను గడపటం ? అందుకని ఇంకో పెళ్లి చేసుకోనేందుకు నిశ్చయించుకున్నాడు. అందులో—ఈ సంగతి తెలిసిన తర్వాత, సూరమ్మ పాత ప్రియులు, అతన్ని తన్నటానికి ప్రయత్నించారు. న్యాయంగా తను పోలీసులతో చెప్పి, వాళ్ళ

చెర్మం వలిపించగలడు. కానీ పదిమంది నోళ్ళలో పడాలిగదా ! అతనింత కాలమూ "బుద్ధిమంతుడు" అన్న కీర్తి ఉన్నవాడు. ఆ కీర్తిని వదులుకోవటం అతనికేమాత్రం సమ్మతం గాదు.

*  *  *  *

శేషావతారం మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆ సమయంలోనూ ఆయనకు పాత భార్య జ్ఞాపకం వచ్చింది. ఆయన దృష్టికి ఇద్దరూ ఒకటిగానే కనిపించారు. తన అవసరాలు తీర్చే విక్రమాదిత్యుని సింహాసనపు బొమ్మల్లాగు. ఆయన గొప్ప సంతోషంతో ఈ భార్యను తెచ్చుకున్నాడు ఇంటికి. అందులో జయమ్మ గొప్ప అందం.హరిణ, శాబకంవలె చిలిపిగా, చురుగ్గా ఉంటుంది. పచ్చని వళ్ళు, రెప్పలమీద ముసురుకొనే పచ్చని స్వప్నాలు. ఆమెకు చెవల నీలంముద్దులు, రోజారంగు బేసరి, నల్లని తీగెగాజులు చేతులువి. చాలు ఆమెకు అతను ఇష్టంలేదు, జయమ్మ అమ్మకూ, నాన్నకూకూడా. కానీ వాళ్లు బీదలు. ఏం చేస్తారు పెళ్లికూతురుకు, అన్ని వేల కట్నాలు యిచ్చి ? ఆమె సౌందర్యం శాశ్వతంగా భుక్తం చేసుకోవాలని చాలామంది ముందుకు దూకారు. అయితేనేం ? వాళ్ళు కట్నం గూడా ఇవ్వలేని పేదలని తెలిసి, ఎవ్వరూ రాలేదు ముందుకు. సౌందర్యం కావాలి తమకు. కానీ అందుతోబాటు డబ్బు గూడా కావాలి. డబ్బు ప్రమేయం లేకుండా, అందాన్ని జీవితానికి తీసుకునే ధైర్యమూ, నైపుణ్యమూ లేదు. ఒక అట్లు పెనం లలనామణి పదివేల కట్నం డబ్బుతో వస్తే "రంభ" క్రింద ఆలోచించి, చూసి, చిరకాలం ప్రేమించటానికి అభ్యంతరం లేదు వాళ్లకు. ఏ ఆర్టునూ, ఔన్నత్యాన్నీ డబ్బు స్కేలుతో కాక, కొలవటం చాతకాదు వాళ్ళకు.

ఇంక దుర్భరమై, కూతురు జీవితం దుస్సహమని తెలిసి గూడా వాళ్లు శేషావతారానికి యిచ్చి, వెంట పంపించారు జయమ్మను. ఈ భార్య వచ్చిన తరువాత అతను పూర్తిగా మారిపోయినాడు. వెనకటి దిగులు, చాలా అస్పష్టంగా, దూరతీరాల మిణుగురు కాంతిలాగు అయింది. ఆమెను గొప్పగా, చిరకాల తపస్సుకు మెచ్చి, దేవుడిచ్చిన పవిత్ర వరంలాగు, వాసంత సమీరంలాగు చూసుకుంటున్నాడు. అతనికి ఆమెమీద గాఢమయిన "ప్రేమ" వచ్చింది. ఆమె కోసం ఏ "త్యాగం" చెయ్యటానికైనా శేషావతారం హృదయం సిద్ధంగా ఉంది. ఖరీదైన చీరలు తెచ్చాడు. మంచానికి స్ప్రింగులు

వేయించాడు. బహుశా ఈ ప్రపోజల్ జయమ్మవయి ఉండొచ్చు. ఎందు కంటే, ఆయన పాత భార్యతో సాదా మంచం మీదనే గడిపేవాడు.

కానీ ఆయనకు ఈ ఆనందం ఎక్కువ కాలం దక్కే యోగ్యత లేక పోయింది. ఒక రోజు బజారునుండి వచ్చేసరికి, తలుపులు వేసిఉన్నయి. ఆ వేళప్పుడు తలుపులు వేసి ఉండటం ఎప్పుడూ అతను ఎరగడు. ఎందుకో అనుకుంటూ లోపలకు వెడితే ఆంజనేయులు కౌగిల్లో ఉన్నది, జయమ్మ దేవుడి గదిలో. అతను గడపల్లో ఉండి దగ్గాడు. ఆంజనేయులు, అదిరి, వణికి, చెమటలు కారుస్తున్నాడు. కానీ ఆమె? ఒక్కసారి నిర్లక్ష్యంగా, నిర్భయంగా చూసింది భర్తను; ఆంజనేయులువేపు తిరిగి, పెదిమ కొరికింది. ఆ క్షణాన ఆమెలో ఏ భావాలు మెరుపుల్లాగు కదిలాయో యెవరికి తెలుసు? అతనెంత సాత్వికుడూ నెమ్మదస్తుడూ అయితేనేం? అతనిలో ఎంత "కారుణ్యం" రాసులు రాసులుగా ఉంటేనేం? ఆ నిమిషాన అవన్నీ తప్పుకు న్నాయి పక్కకు. అతనిలో నిద్రిస్తున్న జంతువులు, మృగాలు, బంధనాలను తెంచుకుని, వళ్ళు విదిలించి విజృంభించాయి. వాళ్ళు ఆ కొద్ది "అవకాశం" కొరకు ఎన్ని రోజులు వేచి ఉన్నారో అతను ఆలోచించటల్లేదు. ఎన్ని కలలు కన్నారో చూడటల్లేదు. చివరికి వాళ్ళను అట్లా డిష్టర్బ్ చెయ్యటం పాపం అని కూడా అతనికి తోచలేదు. నెత్తురు ఉడికి నరాలు ఉబికాయి; క్రోధాగ్నికి, జ్వాలాంతభాగం లాగా వణుకుతున్నాడు. తను వంశాను గతంగా, భద్రంగా దాచుకుని, పరమ పదంగా చూసుకుంటున్న "దేవతా రత్నము"ను కార్తికేయుడు మాయవేషంలో దొంగిలిస్తున్నప్పుడు, చూసిన గదాధరునిలా మండిపోతున్నాడు. ఒక్క క్షణం ఆగి శాంతంగా ఆలోచిస్తే మనస్సును సంకుచిత బంధనాలనుండి తప్పించి, విశాల దృష్టి ప్రసాదించి చూస్తే, తన మూర్ఖత్వానికి సిగ్గుపడేవాడు. నవీన భారతీయులందరి లాగు, అతను కూడా స్త్రీ విషయంలో కృకలాసం, కోపాధిక్యతవల్ల యేమాటా నోటినుండి రావటల్లేదు. అతని చూపులకు వేడి ఉంటే, వాళ్లిద్దరి బూడిదా కుప్పలయి ఉండేది ఈ పాటికి.

ఆంజనేయులు మహాపరాధిలాగు, కుంగి కుంచుకు పోయినాడు. అతనిలో మృత్యుభయం, కోరలు సాచి గర్జిస్తున్నది. ముఖం నల్లబడి పోయింది. ఒక చిన్న ప్రహారానికే ప్రాణాలు వదిలే స్థితిలో ఉన్నాడు. కానీ ఆమె! ఆమె ఆంజనేయులవేపు జాలిగా చూస్తున్నది. భర్త ప్రక్కనే

ఉన్నాడనే ధ్యాసే ఆమెలో లేదు. తనవల్ల ఆంజనేయులు ఎట్లా అయిపో యినాడు పిల్లిలాగు! ధీరంగా గర్వంగా మాట్లాడడేమిటి? కానీ ఆ సమ యంలోనే ఆంజనేయులు "ఈమెతో ఈ పాడుపని ఎందుకు చేశాను. భగ వంతుడా?" అని పశ్చాత్తాప పడుతున్నట్లు తెలిస్తే ఆమె మనస్సు నిర్జీవ మయ్యేది.

"ఫో" అన్నాడు శేషావతారం.

ఆంజనేయులు, జయమ్మ, తలలెత్తి చూశారు శేషావతారం వేపు. కోర్టులో గొప్ప ఫీజు వచ్చే కేసు ఓడిననాడు కూడా అతనంతగా విచార పడలేదు. ఎవర్ని పొమ్మంటున్నాడో తెలీక కాసేపు ఆగి—

"ఎవర్ని?" అన్నది జయమ్మ; తననేమో అనుకుని.

"ఎవర్నేమిటి? ఎవరు పోతారు?"

"నేనేమో...?" నసిగి, ఆగింది.

"నువ్వా? పోతావా? ఎక్కడికీ పొయ్యేది?" అని జుట్టు పట్టుకుని ఈడ్చి క్రిందకు నెట్టాడు. బాగి, పొట్టలో, పొట్టక్రింద, బలంకొద్దీ తన్నాడు. కాళ్లతో నలిచాడు. జయమ్మ యేమైందా? శేషావతారం ఎంతసేపు కొట్టాడా? ఆ సంగతి; సీతాదేవిని తొడలమీద కూచోబెట్టుకున్న శ్రీరాముని పటాన్నడిగితే తెలుస్తుంది. శబ్దాలకు బెదిరి మూల మూలలకు పోయిన బొద్దింకల నడిగితే తెలుస్తుంది. కలుగుల్లో చుంచువులు బెట్టి శ్రద్ధగా, చూసిన చిట్టెలుకల నడిగితే తెలుస్తుంది. శేషావతారం అలిసి, ప్రక్కకు చూస్తే ఆంజ నేయులు లేడు.

ఆ రాత్రి శేషావతారం భోజనం చెయ్యలేదు. స్నానము చెయ్యలేదు. డాబామీద చిరిచాప వేసుకుని పడుకున్నాడు. క్రిందినుంచి పెరుగు పచ్చడి తాలింపు వాసన వేస్తున్నది. శేషావతారానికి, పెరుగు పచ్చడన్నా, స్థానం నాటకాలన్నా చాలా యిష్టం. అతని మనస్సు చుట్టూ నల్లని ఊలు చుట్టు కుంది. శరీరంనుండి రక్తమంతా జారిపోయినట్లుంది. ఆంజనేయులు మీద కోపం మండిపోతున్నది. వాణ్నేంచేస్తే "పాపం" తీరుతుంది? పోలాయను పిలిపించి, మెత్తగా తన్నితే? యానాది వాళ్ళతో వాడికొంప లూటీ చేయిస్తే? పోలీసు రిపోర్టు...ఏమని ఇస్తాడు పోలీసు రిపోర్టు? తనింటో యేమన్నా కాజేశాడని—ఇన్ని సంవత్సరాలనుండి లేని దొంగబుద్ధి అతనికి

హఠాత్తుగా, ఈనాడు పుట్టుకొచ్చిందని వాళ్లు నమ్ముతారా? అంజనేయులు పదేళ్ళనుండీ తన దగ్గర గుమాస్తాగా పని చేస్తున్నాడు గదా మరి! అయినా ఈ ముండకు ఇదేం "పాడుబుద్ధి" దీనికేం లోటు చేశాడు తను? పుట్టింట్లో దిన పస్తులు చేసిన ముండయిది—అటువంటిదానికి మంచి తిండి, పనిలేక పోవటమూ ఉండేసరికి... తెగబలిసి—

అట్లాగే నిద్రపోయినాడు ఆ చాపమీద. భార్యమీది కోపంతో, అన్నమూ, నీళ్ళూ మానాడు. అందువల్ల అంతగా బాధ కలగలేదు. ఒక రాత్రివేళ అతనిలో చిక్కని కాంతి వెలిగినట్లయింది. ఆ కాంతిలోనుండి కంచు బొమ్మల్లాగు మెరుస్తూ ఎవరో సుందరులు తన దగ్గరకు వస్తున్నారు. వాళ్ళ వంటినిండా తెల్లటి మెరుగు మంచులాంటి రవసెల్లానుండి సర్వావయవాలూ కన్పిస్తున్నాయి. ఆ సుందరులందరూ అతని చుట్టూ, అతని కళ్ళల్లో లోపల చేరి, అతన్ని చెరచటానికి ప్రయత్నిస్తున్నారు. ఆ ఆనంద భారానికీ, ఉద్రేకానికీ, తట్టుకోలేక కళ్ళు విప్పితే, తన ప్రక్కగా తనను ఒరుసుకొని, చేతుల్లో బిగించి, పెదిమలు కలిపిన జయమ్మ. ఈ ఆనంద విశ్వోదయానికి కారణం జయ.

శేషావతారానికి కోపం రెచ్చిపోయింది. ఇందాక విషయం జ్ఞప్తికొచ్చి "నువ్వ..." మిగతా మాట అననేలేదు అతను. జయమ్మ చప్పున తన నోటితో ఆ మిగతా మాట రాకుండా ఆపింది. అతను కాదనలేకపోయాడు. కానీ, కానీ, లోపల ఎంత సంఘర్షణ! ఎంత అగ్ని! ఆమెమీద ఎంతరోత!

"ఫో, దూరంగా ఫో. నన్ను ముట్టుకోవద్దు...తాకావా?" అని మూలిగాడు శేషావతారం.

కానీ జయ, అతన్ని కావిలించుకొని, గట్టిగా అదుముకుంది. మెల్లిగా, అతన్ని తన హృదయంమీదికి తీసుకొంటున్నది. మధ్యాహ్నం అంజనేయులు కోసం రాసుకున్న సెంటు సౌరభం, శేషావతారం మెదడును తిప్పుతున్నది. అతను ఆమెను దూరం చెయ్యలేక పోయినాడు. ఆమెతో స్ప్రింగ్ మాట్రెస్ మీది ఘడియలు జ్ఞాపకమొచ్చినాయి. కోపంతో ఆమెను, ఎత్తుకుని డాబా దిగి క్రింది గదిలో, మంచానికి విసిరాడు. లైటు వెలుతుర్లో ఆమె స్పష్టం. మళ్ళీ మళ్ళీ ఆ సంఘటన పొడిచి బాధిస్తున్నది అతన్ని. కానీ లైటు కాంతిలో చిరు చెమటతో మెరిసే ఆ తెల్లని కోల ముఖాన్ని, ప్రతిరోజూ, తన శరీరాన్ని

చుట్టుకునే, చేతులను, కాదని వాటికి ముఖం తిప్పి, ఎట్లా ఉండేటం? అతను కోరింది ఆ అందం! దాన్ని త్రోసిపుచ్చితే ఇంక జయలో తనకు కావలసిందేమిటి? జయ మెల్లిగా అతని దగ్గిరకొచ్చి, కొంచెంగా, ముని కాళ్ళమీద నిలిచి, మెడ చుట్టూ చేతులు పొదిపి, కోపంతో వణికే అతని పెదిమలమీద ముద్దు పెట్టుకుంది. అతని హృదయం, "కోరిక"తో ఊగింది. ఒక్క దూకుతో ఇద్దరూ ఆ మాట్రెస్ మీద. పతణ్ణవర్ణోద్భాసితమై, ఆచ్ఛాదనా రహితమైన ఆమె జఘన పురోభాగ నైగనిగ్యత, ఊపిరితోబాటు పొంగే పయోధరాల లాలిమను, రదనచ్ఛదం కోసం, కలలు కంటున్న పెదిమ ఎరుపు, అతని సర్వ సందేహాలను, మురుగునూ అణిచి, ఆమె "బానిస"ను చేశాయి ఆ రాత్రి. "క్యూపిడ్ ఈజ్ స్టుపిడ్" అంటాడు నాగభూషణం! అనేటప్పుడు ఆ వాయిస్‌లో ఎన్నో అర్థాలు, స్ఫురింప చేస్తాడు నాగభూషణం. ఆ ఔన్నత్యం, ఉదాత్తత, నాగభూషణంలో ఉన్నాయి.

ఆ మొన్నాటినుండీ ఆంజనేయులు పని మానుకున్నాడు. అసలు అతను కనిపించనే లేదు. ఆ వీధిగుండా పోవలసిన పనున్నప్పటికీ మానుకుని ఇంకో బజారున పోతుండేవాడు. అతను అదృష్టవంతుడూ, దురదృష్ట వంతుడూను. జయవంటి గొప్ప అందం తనంత కోరి అతనికి లభ్యపడటమే చాలు అతను తన పురుషత్వానికి గర్వపడేందుకు. కానీ అతను గర్వానికి బదులు విచారిస్తున్నాడు. ఇందువల్ల అతని ఉద్యోగం పోయింది. ఒక భార్యా, ఇద్దరు పిల్లలూ ఉన్నారు అతనికి. ఈ కష్టపు రోజుల్లో వాళ్ళకు "తిండి" ఎల్లా? ఈ ప్లీడరు గుమాస్తా పని తప్ప ఇంకేమీ చాతకాదు. చిన్నతనంనుండీ ఇందులోనే మెదిగాడు. తనతోబాటు సుబ్బులు, ఇద్దరు పిల్లలూ పస్తులు. వెన్నెల రేఖ, మలయపవనం, ప్రేమ, సెక్సు, ఆలింగనం, వెచ్చని ముద్దు—ఇవన్నీ అణిచిపెట్టి నాలుగురోజులు భోజనం లేకపోతే ఏ గొప్ప రసికుడూ కోరడు. ముందు భోజనం, తర్వాత శృంగారం. అయితే వీటన్నిటినీ అధిగమించి శృంగారమే జీవన గమ్యమని తలచేవాళ్ళ మాటేమిటి?

ఒకరోజున ఆంజనేయులు ఒక వీధి మూల తిరుగుతుంటే, శేషావతారంగారి పని మనిషి కనిపించి, బొడ్లోనించి చిన్న కాగితం ఉండ యిచ్చి వెళ్ళింది. విప్పి చూశాడు. "రాత్రికి దొడ్లోకి రా. తప్పకుండా. నీ కోసం బాదంచెట్టు క్రింద ఉంటాను. జయ." అని ఉంది. అతనికి కోపం వచ్చింది జయమీద. దీని మూలకంగానే తను ఇన్ని కష్టాలు పడుతున్నాడు. ఇట్లా

ఆకలికి బాధపడుతున్నాడు. అప్పటికీ తను చాలా రోజులు తప్పుకు తిరిగాడు. ఆమె ఎంత చొరవ తీసుకున్నా తనమీద, బైట పడేవాడు కాదు. ఆఖరికి ఒక రోజున ఏదో కాగితం కోసం సాయంత్రం పూట గదిలో వెదుకుతుంటే తలుపువేసి, తన ప్రక్క వచ్చి నిలుచుంది జయ. అతనికి ముచ్చెమటలు పోసి నాయి. ఎట్లా తప్పించుకోవాలో తెలీక తబ్బిబ్బవు తున్నాడు. ఆమె వచ్చి, నవ్వి, దగ్గరకు తీసుకుంది అతను జయకంటే, వాస్తవంగా బలవంతుడు. కానీ ఆ క్షణాన ఆమె కౌగిలిలో నుండి బైట పడలేక పోయినాడు. అట్లాగే అతన్ని పక్క వేపు తీసుకెళ్ళింది...అతనికి ఎంత ఇష్టం లేకపోతేనేం, అతని మనస్సును, కారు చక్రంలాగు స్వేచ్ఛగా అటూ ఇటూ తిప్పింది. తన ఇష్టమైన పద్ధతిలోకి మార్చుకుంది.

"ఏమిటి అంజీ! అట్లా దిగులుగా ఉన్నావు?" అన్నది జయ, పమిటతో అతని వక్షంమీద చెమట తుడుస్తూ.

"పోతాను" లేచాడు అతను ఆమె వళ్ళోనుండి.

"సరేలే, ఉండు పోదువుగాని. ఏమిటిది? ఎందుకు దిగులు?"

"ఆయనకు తెలిస్తే?" అదీ అతనికి దిగులుకు కారణం.

"ఎవరికి? ప్లీడరుగారికా?"

"అవును. తెలిస్తే? ఇంకేమన్నా ఉందా?"

"ఏం ఉంది?" నవ్వింది అతని పిరికితనానికి.

అతను సిగ్గుపడ్డాడు; ఎందుకు అన్నానా అని.

"మిమ్మల్ని..."

"ఏమిటి నన్ను? ఏం చేస్తాడు?"

"కొడతాడు. ఇంట్లోంచి గెంటుతాడు."

"ఏం తప్పు చేశాను?"

చచ్చాడు. ఇది "తప్పు" అని ఆమెకు నిజంగా తెలీదా? తెలిసే చిన్న స్టంట్ చేస్తున్నదా? లేక పిచ్చిదా?

"మీరు ఇంకోరి భార్యలు. భర్త ఉండగానే పర పురుషునితో సంబంధం పాపం కాదా మరి?" పెద్ద బాలశిక్ష ఇంకా మరిచిపోలేదు.

"ఎవరికి పాపం ? నాకా ? నాకే అయితే ఇది పాపమనిపించటం లేదు. అనిపించితే నీ దగ్గిరికి రాకనేపోదును. నేను తప్ప ఇతరులకు పాపమా? అయితే రాకేం ? ఇందువల్ల నాకే నష్టమయితే, మిగతా వాళ్ళందరూ జోక్యం చేసుకోవటం అనవసరం. అందరికీ నష్టమా ? నే నెందుకు మానుకోవాలి ?"

నో[illegible] బిగుసుకుపోయింది. ఉంగిడి తగిలిన గోడ్డులాగయినాడు. ఆ క్షణం మొదలుకొని కొంతకాలం హాయిగా గడిపాడు. ఆమె అతనికి, పాతికా పరకా, యిస్తుండేది. ఒకటి రెండుసార్లు పట్టుబడబోయి, కనురెప్ప పాటులో తప్పించుకున్నారు.

"ఇక వద్దు. మానుకొందాము" అన్నాడు ఆంజనేయులు వొకనాడు.

"ఏం ?"

"దొరుకుతాము."

"ఏం చేస్తాడు దొరికితే ?"

"ఇంట్లోంచి తరుముతారు" అన్నాడు కసిగా.

"మరీ మంచిది. ఇద్దరం హాయిగా కలిసి ఉండవచ్చు, ఎప్పుడూ విడవకుండా."

"నా ఉద్యోగం పోతుంది. అవతల భార్యా, పిల్లలూ ఉన్నారు నాకు. ఇక మానుకోండి. అయిందేదో అయింది" అని నమస్కారంచేసి పోతున్నాడు.

"ఆగు" వెనక్కు తిరిగాడు.

ఆమె ఏడుస్తున్నది. అతనిమీద కామమా ? ప్రేమా ? ఒళ్ళు తెగబలవటమా ? అదే ఆంజనేయులుతో కాక, శేషావతారం పోతున్నప్పుడు అంటే పతివ్రత అయ్యేది జయమ్మ. అట్లా కాక, తన హృదయాన్ని తేజో పుంఖితం చేసి, తన స్త్రీత్వానికి అర్థం ప్రతిపాదించిన ఆంజనేయులితో అయ్యేటప్పటికి జయమ్మ కులటు, పతిత అయింది. శరీరానికి "తాళి" కట్టినవాడు, శరీరానికే భర్త అవుతాడుగానీ హృదయానికి కాడుగదా !

ఏది ఏమయితేనేం ? గుట్టు బయట పడింది. ఉద్యోగం ఊడింది. తనకు దిక్కు లేదు ఇక. ఈ సంగతి నలుగురికీ తెలియకుండా ఉంటుందా ? తెలిసిన తర్వాత, తనను నమ్మి, ఏ ప్లీడరు యిస్తాడు ఉద్యోగం ? ఇక తన

గ తేమిటి ? ఇప్పటికే తన స్థితి యింత అధ్వాన్నంగా ఉంది. ఇంకా ఈ రాత్రి గూడా వెడితే ! ఎట్లా మారతాయో పరిస్థితులు? ఇది నిజంగా జయ రాసిందే కావచ్చు. కానీ, భర్త—దగ్గరుండి రాయించి, తను రాత్రి వచ్చినాక, విరగ తన్నటానికి కాగూడదూ ? అట్లా కాదనుకోనేందుకు తనకేం ఆధారాలున్నాయి ?

ఆంజనేయులు ఆ రాత్రి వెళ్ళలేదు. కానీ జయమాత్రం వచ్చింది ఆ చెట్టు దగ్గరకు; అప్పటికీ భర్త ప్రొద్దు పోయిందాకా మేలుకొనే ఉన్నాడు. ఇటీవల ఆయన వెందలాడే నిద్రపోవటం మానుకున్నాడు. ఒకవేళ పోయినా, భార్యను జాగ్రత్తగా కౌగిలించుకుని కానీ పోడు. తన భార్యను మరో పురుషుని దగ్గరకు—ముఖ్యంగా ఆంజనేయులు దగ్గరకు పోకుండా చేయమని శేషావతారం శ్రీరాముడికి మొక్కుకున్నాడు. తన భార్యను రావణాసురుడు తీసుకెళ్తే నానా అవస్థలూ పడి తెచ్చుకున్న శ్రీరాముడు శేషావతారం భార్య మరొకడితో పోకుండా ఏమి చేయగలుగుతాడు ? కాకపోతే తెలిసివున్న సంగతి కనుక తను చేసినట్టే నువ్వూ చెయ్యమని సలహా ఇవ్వగలుగుతాడు. ఆమెకు తెలుసు తను చేస్తున్న ఈ సాహసం చాలా ప్రమాద భూయిష్టమని. అందువల్ల తన జీవితం అధోగతి పాలేనని కూడా తెలుసు. ఇన్ని తెలిసి కూడా మరి ఆంజనేయులు కోసం ఆమెను ఆ అర్ధరాత్రి ఆ చెట్టు క్రింద కూచోబెట్టిన దేమిటి ? "ఒంటి మదం, కొవ్వు" అని సులభంగా తేల్చి పారేస్తున్నారు నవీన నీతి కథకులు. అదే జయమ్మ చెట్టు క్రిందగాక గడపల్లో, శేషావతారం కోసం కూచుంటే, పతివ్రత, ఆదర్శ గృహిణి సచ్ఛీల అంటున్నారు.

రోజులు గడుస్తున్నాయి. శేషావతారంలో నుండి క్రమ క్రమంగా ఆ సంఘటన దూరమవుతున్నది. మళ్ళీ జయమ్మను విశ్వసిస్తున్నాడు. కాని ఒక్క కన్ను మాత్రం ఏమరటల్లేదు. ఒకరోజు రాత్రి ఎందుకో మెలకువ వచ్చి చూస్తే—పక్కలో జయ లేదు. దీపం ఆరి ఉంది. తడువుకుంటూ స్విచ్చి వేశాడు. బొద్దింకలు, బల్లులు మూల మూలలకు పోయినాయి. తలుపు రాలేదు. లాగాడు. బయట గొళ్ళెం, గుండెల్లో భగ్గుమని మంట. వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. తలుపులు ఎత్తి, బైటకొచ్చాడు. తెల్లగా వెన్నెల పుచుమని వుంది. వారం రోజుల క్రిందట తను కొన్న సెంటు బావి మూల నుండి వస్తున్నది. రెండు నిమిషాలు ఆగి అటూ ఇటూ చూశాడు. ఎవ్వరూ

కనిపించలేదు. మెల్లిగా అడుగులు వేసుకుంటూ దొడ్లోకి వెళ్ళాడు. బాదం చెట్టు నీడక్రింద, ఆంజనేయులు వళ్ళో ఉన్నది జయ. రెండు చేతులూ మెడకు చుట్టింది. అతను జయను వీపుక్రిందుగా చేతులతో తనకు గట్టిగా వేసుకొన్నాడు. శేషావతారంలో అగ్ని పర్వతం బ్రద్దలయింది. జయ తనది. ఆ చేతులు తనను అట్లా మెలిక వేసుకోవాలి. ఆ గుసగుస తన చెవుల స్వంతం. వాడితో తనను గురించి యేమని చెప్పిందో ? తన నెంత హీనం చేసిందో ? తను వాడి దృష్టిలో ఎంత చులకనయిపోయాడో ? పంచె ఎగగట్టి అమాంతం వాళ్ళ ముందు దూకాడు. ఇద్దరూ చట్టున లేచి నుంచున్నారు. శేషావతారం పిడికిలి బిగించి, ఆంజనేయులు మీదికి వచ్చాడు. ఆ దెబ్బకు ఆంజనేయులు దౌడ పగిలేది. కాని జయ, ఆ చేతిని పట్టుకుని, క్రిందికి లాగింది.

"పో! అంజీ! తొరగా పో" అని అరిచింది. లాగి, శేషావతారం కడుపులో తన్ని ఆంజనేయులు వెళ్ళాడు. తిరిగీ శేషావతారం కళ్ళు తెరిచేటప్పటికి, జయమ్మ అతనికి వేడినీళ్ళ కాపు కాస్తున్నది. అతను కదిలాడు. నరాలు ఘోరంగా బాధపెట్టాయి. పొత్తికడుపులో శూలాలు పొడుస్తున్నట్లుగా వుంది. జయమ్మవేపు చూశాడు. ఆమె పమిటతో కళ్ళు వొత్తుకొంటున్నది.

"ఎందుకే ఏడుస్తున్నావు ? మిండగాడితో... తెల్లవార్లూ కులకలేకపోయినావనా ?" పళ్ళు బిగబట్టి, గట్టిగా అన్నాడు.

జయ మాట్లాడలేదు. ఇంకా కాస్తూనే వుంది వేడినీళ్ళతో.

"చిట్ట చివరికి నాగతి ఎంత అధోగతి అయింది ? ఎంత గౌరవంగా బతికిన వాడికి ఎటువంటి నీచం దాపరించింది ! ఆఖరుకు లంజ మొగుడితో తన్నించావు" అని ఏడిచాడు శేషావతారం.

"వాడు దుర్మార్గుడు, వాడిజోలికెందుకు వెళ్ళారు ? అన్నది జయ. "చూడండి ! ఈపక్క ఎట్లావాచిందో !!"

"మరి - వాడు నా జోలికెందుకు రావాలి ?"

"మీజోలి కేమొచ్చాడు ? ఏమన్నాడు మిమ్మల్ని ? ఒక వేళ యేమన్నా అంటే, రేపు చెబుతాను, మిమ్మల్నేమీ అనొద్దని."

"రేపుగూడా వొస్తాడా వాడు ?"

లేవబోయినాడు. జయమ్మ సద్ది పడుకోబెట్టింది.

"నా జోలికి రాకపోవడమేమిటి ? నిన్ను అట్లా చెయ్యటం అంటే, నాజోలికి రావటం కాక ఏమవుతుంది ?"

"అది నన్ను - మిమ్మల్ని కాదుగదా !"

"నువ్వేమిటి, నేనేమిటి ? మనిద్దరంవొకటే! పెళ్ళికాకముందు నువ్వు "నువ్వువు" ఇప్పుడు ఇంక "నువ్వు" లేవు. నువ్వు నా దానివి" అన్నాడు తన "లా" అంతా ఉపయోగించి.

"ఇందాక మీరు రాబొయ్యేముందు, అంజిగూడా అంతే అన్నాడు· నేను అంజి సొంతమట. అతనికి దొరికిన దేవతావరాన్నిట" అన్నది నవ్వి.

ఈ మాటకు అతను ఎగిరి కూచున్నాడు. ఆమె జుట్టుపట్టుకొని నుంచో బెట్టాడు.

"ఈ నిమిషంనుండి నువ్వు వాడిపేరు ఎత్తబోకు. వాడ్ని తలుచుకో బోకు. ఆఖరిసారి చెబుతున్నాను. ఇంక నిన్ను క్షమించను"

జుట్టుతప్పించుకొని దూరంజరిగింది జయ.

"మీకేం నష్టం ఇందువల్ల ? మిమ్మల్ని ఫలానాపని చెయ్యొద్దని నేను అంటున్నానా ? నన్నుమాత్రం మీరెందుకనాలి ?"

"దానివల్ల నేను ఎంత అవమానపడుతున్నాను ! ఫలానా శేషావతారం బి. యె. బి. యల్. గారి భార్య గుమాస్తా అంజనేయులతో పోతున్నదని నలుగురూ అంటే నేనెట్లా తలెత్తుకొని తిరిగేది ?"

"మీరు అవమానంగనక మానుకోమంటారా ? ఒక స్త్రీ ప్రవర్తన మీద ఆధారపడివుండే గౌరవాగౌరవాలు ఎంతపాటివి ? వాటి విలువెంత ? మీరు ఇంకో స్త్రీని ప్రేమించినప్పుడు, నేను చాలా గర్విస్తాను, నాభర్త ఎంత రసికుడా అని. అట్లాగే, నేను మరొకర్ని ప్రేమించినప్పుడు, లేదా, మరొకరు నాకోసం, తాపత్రయ పడుచున్నప్పుడు, మీ భార్య గొప్ప రసికురాలని మీ రెందుకు సంతోషించరు ? ఇది అవమానమూ! నీచమూ, ఎట్లా అయింది ?"

అతను చదివిన ఏలా పుస్తకంలోనూ, ఈ సవాలుకు సమాధానంలేదు. ఇటువంటి ముద్దాయిని అతను ఎన్నడూ ఎదుర్కోలేదు.

"నా జోలికి రాకపోవడమేమిటి? నిన్ను అట్లా చెయ్యటం అంటే, నాజోలికి రావటం కాక ఏమవుతుంది?"

"అది నన్ను - మిమ్మల్ని కాదుగదా!"

"నువ్వేమిటి, నేనేమిటి? మనిద్దరంవొకటే! పెళ్ళికాకముందు నువ్వ "నువ్వవు" ఇప్పుడు ఇంక "నువ్వ" లేవు. నువ్వ నా దానివి" అన్నాడు తన "లా" అంతా ఉపయోగించి.

"ఇందాక మీరు రాబోయ్యేముందు, అంజిగూడా అంతే అన్నాడు' నేను అంజి సొంతమట. అతనికి దొరికిన దేవతావరాన్నిట" అన్నది నవ్వి.

ఈ మాటకు అతను ఎగిరి కూచున్నాడు. ఆమె జుట్టుపట్టుకొని నుంచో బెట్టాడు.

"ఈ నిమిషంనుండి నువ్వ వాడిపేరు ఎత్తబోకు. వాడ్ని తలుచుకో బోకు. ఆఖరిసారి చెబుతున్నాను. ఇంక నిన్ను క్షమించను"

జుట్టుతప్పించుకొని దూరంజరిగింది జయ.

"మీకేం నష్టం ఇందువల్ల? మిమ్మల్ని ఫలానాపని చెయ్యొద్దని నేను అంటున్నానా? నన్నుమాత్రం మీరెందుకనాలి?"

"దానివల్ల నేను ఎంత అవమానపడుతున్నాను! ఫలానా శేషావతారం బి. యె. బి. యల్. గారి భార్య గుమాస్తా అంజనేయులతో పోతున్నదని నలుగురూ అంటే నేనెట్లా తలెత్తుకొని తిరిగేది?"

"మీరు అవమానంగనక మానుకోమంటారా? ఒక స్త్రీ ప్రవర్తన మీద ఆధారపడివుండే గౌరవాగౌరవాలు ఎంతపాటివి? వాటి విలువెంత? మీరు ఇంకో స్త్రీని ప్రేమించినప్పుడు, నేను చాలా గర్విస్తాను, నాభర్త ఎంత రసికుడా అని. అట్లాగే, నేను మరొకర్ని ప్రేమించినప్పుడు, లేదా, మరొకరు నాకోసం, తాపత్రయ పడుచున్నప్పుడు, మీ భార్య గొప్ప రసికురాలని మీ రెందుకు సంతోషించరు? ఇది అవమానమూ! నీచమూ, ఎట్లా అయింది?"

అతను చదివిన ఏ లా పుస్తకంలోనూ, ఈ సవాలుకు సమాధానంలేదు. ఇటువంటి ముద్దాయిని అతను ఎన్నడూ ఎదుర్కోలేదు.

"నోర్మూయ్. తంతాను వెధవ కదిపావంటే! ఇంక నువ్వు అడుగు బైటకు పెట్టడానికి వీల్లేదు. ఈ దఫా అటువంటి "పాడుపని" చేశావంటే నరికి పోగులు పెడతాను" అని కోపంగా ఆమెతో సహా వెళ్ళిపడుకొన్నాడు; ఆమెకు ఏ మాత్రం తగలకుండా.

కానీ శేషావతారం తన ప్రతిజ్ఞను నెరవేర్చుకోలేక పోయినాడు. యింకోరోజున ఇంట్లో ఏదో వెతుకుతుంటే వెండిచెంబు కనిపించలేదు.

"ఏమయింది?" అన్నాడు భార్యను.

ఆమె పలకలేదు.

"పలకవేం?" అన్నాడు.

"నాకు తెలియదు" అన్నది.

ఆ కంఠంలోని అబద్ధం గ్రహించాడు. గట్టిగా అడిగితే, బియ్యం లేవన్నాడని, అమ్ముకుని తెచ్చుకోమని అంజనేయులు కిచ్చానని చెప్పింది. మళ్ళీ కొట్టాడు. ముఖంమీద గుద్దాడు. ముక్కు ఎముక చెదిరి నెత్తురు వచ్చింది. తల గోడకేసి పొడిచాడు యిక కొట్టలేక, జాలిపడి వెళ్లాడు. అర్ధరాత్రికల్లా కట్లు కట్టుకుని అతని దగ్గరి కొచ్చింది. ఆ కట్లు చూసేసరికి అతనికి ఏడుపొచ్చింది. వెంటనే సంబాళించుకున్నాడు. కోపం రగిలించుకున్నాడు. మంచం దగ్గిర కొచ్చినదాన్ని, దూరంగా నెట్టాడు. కానీ ఆమె పోలేదు. పొమ్మన్నాడు. గట్టిగా తోశాడు. విసుగెత్తి డాబామీది కెళ్ళి, పిట్టగోడ నానుకుని, నుంచున్నాడు. అతనికేమీ తోచటల్లేదు. ఎట్లా దీన్ని పరిష్కరించాలి? ఏమిటి త్రోవ? చుట్టూ నల్లని చెట్లు, వాటి ఆకులమీద వెలిగి, నీడలయ్యే వెన్నెల. దూరంగా రుక్క అరుపు, రైలు కూత. కదలబోయ్యాడు. ఎవరో తనను కట్టివేసినట్లు—ఎవరు? జయమ్మ, అతని పక్కకొచ్చి నిలుచుంది, రెండు చేతులూ చుట్టి. అతను జయవేపు చూశాడు. ఆమె కళ్ళల్లో పిచ్చి కాంతి వెలుగుతున్నది. మళ్లీ మనసు త్రోవ తప్పుతున్నది.

"లోపలకు రండి, రాత్రిళ్ళు మేలుకుంటే జబ్బు చేస్తుంది" అని క్రిందికి తీసుకెళ్ళింది. కుక్కలాగా వెళ్లాడు. ఆమె చేతిలోనుంచి అతనిలోకి విద్యుత్తు. నర నరాలూ భగ్గుమని మంట. మెదడు గ్లోబులాగు తిరుగుతున్నది. జయమ్మ, పక్క సర్ది, అతన్ని లాగి, తనూ నడుం వాల్చింది. మొగవాళ్ళు పసిపిల్లలు.

ఎంత అల్లరిపెట్టి, గోలచేసి, చొక్కా చింపుకుని, నేలమీద పడి ఏడిస్తే నేం? ఆ కాసేపూ ఊరుకుని, తర్వాత రొట్టెముక్క కళ్ళకు చూపిస్తే, కుడుము చేతికిస్తే చాలు, అంత క్రితమున్న, అన్ని ఈసడింపులూ, రుసరుసలూ, యేడుపులూ మాయమయి మళ్ళీ కిక్కురుమని నోరెత్తరు. ఇది సృష్టి నిర్ణయం!

ఒకసారి శేషావతారం, అమీ తుమీ తేల్చుకుందామని నిర్ణయించుకున్నాడు. రోజు రోజుకు ఇంట్లో సామాను కనిపించటంలేదు. పెట్టెలో డబ్బు, మాయమవుతున్నది. ఇట్లాగయితే—ఇక ముందేమిటి? ఆ రాత్రి జయమ్మను అడిగాడు శేషావతారం.

"ఏమిటి?" అన్నది జయ.

"నేనంటే నీ కిష్టంలేదు అవునా?" అన్నాడు.

ఆమె పలకలేదు.

"నేను నిన్ను చేసుకున్నాను. నీకు తిండి పెడుతున్నాను. నీ సర్వ రక్షణలూ, బాధ్యతలూ చూస్తున్నాను. కానీ, నా మీద నీకు ప్రేమలేదు నా మీద నీకు..."

మధ్యలో—"వుంది. మీరంటే నాకు చాలా యిష్టం!" అన్నది!

"అబద్ధం—నామీద ప్రేమ ఉంటే, ఆ ఆంజనేయులతో ఈ పని చేస్తావా?"

"అతనూ యిష్టమే!" అన్నది జయ.

"ఇదేమిటి? ఇద్దరిమీద ఒకేసారి ప్రేమ ఉంటుందా? ప్రేమ ఒకరి మీదే ఉండాలి. ఇద్దరిమీద ప్రేమ ఉండటం అసంభవం."

"మరి నాకు ఉన్నది."

"అది ప్రేమగాదు—కామం—మృగత్వం" అన్నాడు నొక్కి నొక్కి.

"నే నంటే మీ కిష్టమేనా?" అన్నది జయ.

"లేకపోతే యిదంతా ఎందుకు జరుగుతుంది? ఆ మాత్రం తెలీదా?"

"మీ మొదటి భార్యంటే మీకు ప్రేమ ఉన్నదా?"

"ఆమెను చాలా ప్రేమించాను" అన్నాడు గర్వంగా.

"మరి మీ కెట్లా సంభవమయింది యిది? మీ మొదటి భార్యనూ ప్రేమించారు, నన్నూ ప్రేమిస్తున్నా మంటున్నారు. మీ మాట ప్రకార మయితే, ఒక మనిషి, ఒకర్ని మాత్రమే ప్రేమించాలి గదా! మరి మీరు అట్లా కాదేం ?"

అతని తల తిరిగిపోతున్నది.

"లాభంలేదు, నీ హృదయంలో నాకు చోటు లేదు. నువ్వు ఆంజనే యుల్ని ప్రేమి..." అంటున్నాడు.

"కాదు. నాకు అబద్ధాలు చెప్పటం కుదరదు. మీరు నాకు చాలా యిష్టం."

"మరి ఆంజనేయులు !"

"వాడికి—శరీరం యిస్తున్నాను. హృదయం మీది. అదెప్పుడూ మిమ్మల్ని కోరుతూనే ఉంటుంది. కానీ దైహిక బాధకు మాత్రం ఆంజనే యులు. సరేనా ! యింక పండుకోండి, ఇట్లా దగ్గరకు జరిగి."

అతను లేచి కూచున్నాడు.

"యీ ప్రేమలూ, హృదయాలూ ఉత్త చెత్త. నువ్వు ఇంక వాడితో మాట్లాడ గూడదు. మాట్లాడితే...?"

"మాట్లాడితే మీకేం నష్టం? మీ అన్ని అవసరాలూ తీరుస్తున్నాను. మీకు ఎప్పుడూ ఏ విషయంలోను "కాదు" అనలేదు. మీ కంతకంటే యేం కావాలి? మీకు అవసరమున్నా, లేకపోయినా మిమ్మల్నే నీడలాగు అంటి పెట్టుకుని ఉండమంటారు. పోనీ మీకు ఫలానప్పుడు ఫలానా "లోటు" చేశానని చెప్పండి."

శేషావతారం చెప్పలేదు. అతనే గాదు, ఎవ్వరూ చెప్పలేరు ఈ ప్రశ్నకు సమాధానం. జవాబు తెలుసు. దాన్ని చెప్పగల ధైర్యమే లేదు. తన అవసరాలు పుష్కలంగా పోను, ఇంకా డబ్బు, పెట్టెల్లో దాచుకునే వాణ్ని, తనకు సరిపడిన దానికంటే, ఇంకా ఎక్కువ పొలాలు ఉంచుకొన్న వాణ్ని, దుర్మార్గుడూ, దోపిడీగాడూ, నరరూప రాక్షసుడూ అంటున్నారు చాలామంది. వాడిమీద ప్రపంచమంతా, మండిపడుతున్నది. అట్లా ఉంచు కోవటం, అనాగరికమూ, మూర్ఖమూ అని గొంతెత్తి చాటుతున్నారు. మరి

ఈ అనాగరికము, మూర్ఖమూ విషయమేమిటి? తనకు అవసరమున్నా లేక పోయినా, తననే కుక్కలాగు స్త్రీ అంటిపెట్టుకుని ఉండాలి. నిర్జీవమైన, డబ్బు, పొలాలే, ఒకడి "స్వంతం"గా ఉండటం ఘోరమయినప్పుడు, ఒక ప్రాణి, మరొక ప్రాణికి, కేవలం స్త్రీగా జన్మించిన మహా నేరానికి గాను-శాశ్వతంగా భుక్తమై ఉండటము ఘోరం కాదా? ఇందులో సౌశీల్యమూ, స్వచ్ఛత, ఉన్నత సాంఘికాశయము, పవిత్రత, సంఘ రక్షణ నిండి ఉన్నాయి (ట). "సంఘం చెదరకుండా, కట్టు దిట్టంగా, పటిష్టంగా, ఉండాలంటే, అట్లా ఉండటం చాలా అవసర"మంటున్నారు సంఘరక్షకులు. కీర్తి శేషులు హిట్లర్నూ, విన్స్టన్ చర్చిల్నూ అడగండి. సంఘాన్ని గురించి ఇవే మాటలు చెబుతారు. సంఘం ఫలానా ఫలానావిధంగా ఉండటానికి, ప్రస్తుతమున్న విభేదాలు అంతే ఉండాలంటారు. వాళ్లూ సంఘశ్రేయస్సుకోసమే ఆ మాటలన్నా మంటారు. కార్మికుల్ని, మధ్య తరగతిని, దృష్టిలో పెట్టుకుని, వాళ్ళు మాటలన్నంటుకు, కలియుగ రాక్షసు లయితే, స్త్రీలను దృష్టిలో ఉంచుకుని, ఈ మాటలనే ప్రతి పురుషుడూ ఏ యుగపు రాక్షసుడు కావాలి?

అతను తేల్చుకున్నాడు జయతో వాదన పెట్టుకుని గెలవలేనని. కోర్టుల్లో, హేమా హేమీల్లాంటి ప్లీడర్లను, తలలు ఎగిరే కేసుల్లో సయితం, హడలుగొట్టిన శేషావతారం, భార్య అడుగుతున్న అతి సాధారణ మయిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పోయినాడు. యింక తనకు మిగిలింది ఒకటే దోవ. దాన్ని గూడా ఉపయోగించాలి.

వాళ్ళు పేదవాళ్ళు. కూటికి, గుడ్డకూ ముఖం వాచారు. ఆ పేదతనం వల్లనే గదా జయ తనకు లభ్యపడింది! ఆ పేదతనాన్నే ఇప్పుడు తను ఉపయోగ పెడితే! ఒక రోజు చిన్న ఎక్స్‌పెరిమెంట్ చేశాడు.

"అవును. పేదలయితే యేమిటి?" అన్నది జయమ్మ.

"ఏమీ లేదు. ఈ దఫా యిటువంటి "వెర్రి వేషాలు" వేశావంటే నా ఇంట్లోంచి వెళ్ళగొడతాను" అన్నాడు.

ఆమె దిగులుగా తల వంచుకుంది. శేషావతారంలో సంతోషం పొడుచు కొచ్చింది ఆమె దిగులు చూసి. రెట్టించిన ఉత్సాహంతో చెప్పకు పోతున్నాడు.

"జాగ్రత్త. నలుగురూ కాండ్రించి నిన్ను ఉమ్మేతారు. పదిమందిలో తిరగలేవు. ఇటువంటి "కులట"వని తెలిశాక మీవాళ్లు నిన్ను మళ్ళీ చేరనిస్తారా ఇంటోకి ? ఒకవేళ కన్న తీపుకొద్దీ చేరదీసినా ఏం తింటావు అక్కడ? వాళ్ళే దినపస్తులు చేస్తున్నారు గదా! నువ్విక్కడ ఉన్నావుగదా అని, నిన్ను చూసి పదో, అయిదో పంపుతున్నాను మీ వాళ్ళకు. అది మానతాను. వాళ్ళు తిండిలేక మలమల మాడి చస్తారు. వాళ్ళతోపాటు నువ్వూనూ. ఒళ్లు దగ్గరుంచుకుని మసులు, అయిందేదో అయిపోయింది. జరిగిందంతా మరిచేందుకు ప్రయత్నిస్తాను. సరేనా ?"

సమాధానం కోసం ఆమె ముఖాన్ని వెదికాడు. రెండు చేతులూ ముఖానికి కప్పుకుని ఏడుస్తూ వెళ్ళిపోయింది. శేషావతారం దిగ్విజయం చేసిన వాడిలా గర్వపడ్డాడు. అంతేగాని తనను మనసా, వాచా అసహ్యించుకునే వ్యక్తిని, డబ్బు చూపి, ఆకలిని చూపి, దరిద్రాన్ని చూపి, భయపెట్టి, హింసిస్తున్నాననే ఆలోచనే రాలేదు. రాదు—ఈ దెబ్బతో జయ పరాజితురాలయిందని శేషావతారం నమ్మితే, అది కేవలం భ్రమ మాత్రమేనని చెప్పవలసి ఉంటుంది. ఎందుకంటే, శేషావతారం చేసిన ఈ బోధలు, ఆమె ప్రవర్తనలో అంత మార్పును తీసుకురాలేదు. ఆమె ఒకటి రెండు రోజులు స్తబ్ధుగా ఉన్నమాట నిజం! కానీ తర్వాత కాదు. ఆమె సర్వ భావనా బంధనాలనుండీ తప్పుకొని హృదయం ఆంజనేయులువేపు మొగ్గుతున్నది. అందువల్ల తల్లిదండ్రులు కష్టపడతారా ? అయితే తనకేం ? వాళ్ళకోసం తనెందుకు తన సుఖాన్ని చంపుకోవాలి. తల్లీదండ్రుల సుఖాన్ని విచారించని సంతానం సంతానమే కాకబోతే, బిడ్డ సుఖాన్ని విచారించని తల్లిదండ్రులు మాత్రం తల్లిదండ్రులవుతారా ? వాళ్ళ సుఖం కోసం తన జీవితాన్ని చీల్చుకోవటం ఎంత న్యాయమో, తన సుఖం కోసం వాళ్లు త్యాగం కావటం అంతే న్యాయం కాదా ?

లాభంలేదు. శేషావతారం ఎన్ని ఉచ్చులు బిగించినా జయ, వాటిని సులభంగా నిర్మూలించగలదు. నిజం చెప్పాలంటే, ఆ మహాశక్తి జయకు ప్రసాదించింది ఒక రకంగా శేషావతారంగారే! అతను ఆమెలో లోపల, గాఢమైన నివురు తెరల మరుగున ఉన్న మహాగ్ని కణాన్ని నిద్రనుండి కదిపాడు. అది నిద్రను విడిచింది. నివురు తెరలను అధిగమించింది. తన ప్రచండ

శక్తితో విజృంభించింది. ఆ శక్తిని ఎదుర్కొనగల శక్తీ, ధైర్యమూ అతనిలో లేవు. ఆ విశ్వతేజాన్ని సందర్శించలేక పోయినాడు. ఇక, అది అనివార్యం.

ఈ విషయాన్ని తెలుసుకోలేని అతను, ఇంకా ఆశక్తిని అరికట్టేందుకు దుర్బల ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆమెను ఎటూ కదల నివ్వకుండా కట్టడి చేశాడు. లేనిపోనివి కల్పించుకుని, ఓపిక ఉన్నంతవరకు, అలుపు వచ్చేంత వరకు కొట్టాడు. అన్నము, నీళ్ళు పెట్టక గదిలో బిగించాడు. సూర్యోదయం కాకుండా, గొడుగు అడ్డం పెట్టిన మూర్ఖుడులాగు. దీనివల్ల ఆమె లొంగుతుందని అతని విశ్వాసం. కానీ, ఆమెలోని పట్టుదలను, మరింతగా యివి దృఢపరుస్తాయని తోచలేదు అతనికి.

ఒకరోజు ఉదయం మామూలుగా ఆమెను ఉంచిన గదిలోకి చూశాడు. తను వేసిన తలుపు తీసి ఉన్నది. కాళ్ళు వణికాయి. కాసేపు అటూ ఇటూ చూశాడు వస్తుందేమోనని. గదిలో కెళ్లాడు. బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో నోట్లకట్టలు ఏమైనట్లు ? అన్ని సొరుగులూ వెదికినా కనిపించలేదు. కుప్పలాగు కూలబడిపోయినాడు. నల్లటి పొగ మబ్బులు, ఎర్రటి నోరు తెరుచుకుని, తనమీదకు వస్తున్నట్లుగా ఉంది. వేలమంది ప్రజలు తన చుట్టూచేరి, గోలగా అరుస్తున్నట్లు, చప్పట్లు కొడుతున్నట్లుగా వుంది. అన్ని గోడలూ యిదే శుభవార్తతో నవ్వుతున్నట్లు భావించి, పాము కరిచిన వాడిలాగా, నిర్జీవుడవుతున్నాడు. ఏమి చెయ్యటానికీ తోచలేదు. తలుపులు బిగించి, ముసుగు పెట్టుకుని, ముడుచుకుని, మంచంమీద పడి ఏడిచాడు.

సాయంత్రానికి తెలిసింది. జయ ఊరిబైట ఆంజనేయులు యింట్లో ఉన్నదని నమ్మకమైన మనిషి ద్వారా. ఇంకొకరిని పంపటం ఇష్టంలేదు. వాళ్లకు తెలిస్తే తనకెంత చిన్నతనం! తను పోవటానికి అభిమానం ఎదురు తన్నుతున్నది. ఎట్లా ? చివరికి తనే గుట్టు చప్పుడు కాకుండా వెళ్లి తెచ్చుకుందామనుకున్నాడు. ఇంటి కొచ్చిన తర్వాత దాని భరతం పట్టాలనుకున్నాడు. రెండు మూడు రోజుల్లో ఆంజనేయులుగాడ్ని పత్తా లేకుండా చెయ్యాలని, గట్టిగా నిశ్చయించుకున్నాడు. తీరా అభిమానం, రోషం, పురుష అహంకారం, చంపుకుని వెళ్ళి అడిగితే—

"నేను రాను" అన్నది జయ.

"ఎందుకని? నీకు నేనేం తక్కువ చేశాను?" అన్నాడు శేషావతారం. ఆతను బిగ్గరిగా మాట్లాడటానికే సిగ్గుపడుతున్నాడు.

ఏమి తక్కువ చేశాడని చెబుతుంది జయ? చెప్పినా అది సబబైన కారణమని ఎందరు నమ్ముతారు?

"ఏమీ లేదనుకోండి. అయినా నేను రాను. మీరంటే పరమ అసహ్యమని మీ ముఖం మీదనే చెబుతున్నాను. ఇట్లా మిమ్మల్ని అసహ్యించుకునే భార్యతో మీరేం సుఖపడతారు? నేను వచ్చినందువల్ల మీకు లోటు రాలేదేమీ. కాకపోతే నాలుగు వేలు డబ్బు తెచ్చాను. ఇనప్పెట్టెలో ఇంకా పదకొండు వేల ఆరువందల ముప్ఫయ్‌నాలుగు రూపాయలున్నాయి. వాటితో మీరింకా పాతికేళ్ళు దివ్యంగా బ్రతకొచ్చు...ఇక వెళ్ళండి. ప్రొద్దుట్నుంచీ అన్నం తినలేదుగావును మీరు ఈ దిగులుతో. మీకు అభ్యంతరం లేకపోతే యీ ఇంట్లో తినండి. కందిపచ్చడి, ఉల్లిపాయ పులుసూ ఉంది—"

అని నవ్వింది. ఆ నవ్వు అతని గుండెల్లో బాకులాగా పనిచేసింది. రకరకాలుగా చెప్పాడు. ఇక కొట్టటమూ, తిట్టటమూ చెయ్యానన్నాడు. వినలేదు. ఆఖరికి పోలీసులతో చెబుతానన్నాడు.

"నా భార్య మరొకరితో పోయింది గనక, దాన్ని నాకు తిరిగి పట్టివ్వమని పోలీసులతో చెబుతావా? అట్లా పోయినందువల్ల సంభవించే విపరీత పరిస్థితులు స్పష్టంగా తెలిసి కూడా, సంబంధం వదలని, ఆ గాఢత్వాన్ని పోలీసులు, కోర్టులూ గ్రహించరా? నువ్వేటువంటి వాడివైతే, నీ భార్య పోయిందనే ప్రశ్న నిన్ను అడిగేవారే ఉండరా ఇన్ని లక్షలమందిలో? ఇవన్నీ వద్దు. ఈ పదిగంటల బండికే మేమంతా బెంగుళూరు పోతున్నాము" అని లోపలకు పోబోయింది జయ.

శేషావతారం నీళ్ళు కారిపోయినాడు. ఆ శక్తిని తనకు సాధ్యమైనంత వరకూ బంధించాడు. అది కూడా ఉండగలిగినంత వరకూ ఉన్నది. ఒత్తిడి అధికమైంది. స్థలం చాలలేదు. బ్రహ్మాండమైన శబ్దంతో కవచం బ్రద్దలు చేసుకుని బైట పడింది. అది అనివార్యం ఎవరికీ, ఎప్పుడైనా సరే! ఫలితం విషమం అయ్యేటప్పటికి, దిగజారి బ్రతిమలాడుకుంటున్నాడు. కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నాడు. ఆమెకే జాలి వేసింది. అల్లరి కొడుకును శిక్షించిన తల్లి హృదయంలాగు అయింది ఆమె హృదయం. ఆ క్షణాన ఆమె పెట్టిన షరతులన్ని

టినీ అతను వప్పుకున్నాడు. ఆంజనేయులు తన కుటుంబంతో సహా, డాబా తూర్పు భాగంలో ఉండటానికి కూడా చివరికి. ఏ క్షణాన తనకు ఇబ్బంది కలిగితే, అప్పుడే బైటికి వెడతానన్నా, అంగీకరించాడు శేషావతారం. అతనికి కావలసింది, ఈ షరతులు కావు. జయ-తన భార్య అయిన జయ.

ఆ రాత్రే, ఆంజనేయులును, జయను తెచ్చుకున్నాడు సందు గొందులు తిప్పి. నిజంగా అతనికి జయ అక్కర్లేదు. ఆమెమీద అపేక్షకూడా లేదు. కానీ అవసరం జయ. ఎందుకంటే ఆమె అతని భార్య. అతని దగ్గిర ఉండాలి. ఉండకుండా మరొకరితో ఉంటే, అతను ఆ ఊళ్ళో ఇక తలెత్తుకుని తిరగలేడు. తనకు కాకపోవచ్చు-కనీసం పదిమంది కోసమైనా తన దగ్గర జయ ఉండటం అవసరం.

అవసరం-ఈ అవసరం మానవుని చేత ఏ పనినయినా చేయిస్తుంది. ఖూనీలు, దోపిడీలు, దొంగతనాలు, వ్యభిచారం చేయిస్తుంది. మానవత్వాన్ని ధ్వంసం చేయించి, వ్యక్తిని అధో లోకంలోని చివరి మెట్టువరకూ తీసుకెడుతుంది. జయ తలిదండ్రులు, తమ కూతురు జీవనం బుగ్గి అవుతుందని కూడా, శేషావతారానికి యిచ్చి చేసిందెందుకు? ఇవ్వకపోతే, తాము డబ్బుతో జయకు భర్తను తేలేరు కనక, తీసుకురావటం తప్పనిసరి "అవసరం" గనక. జయకు తెలుసు ఆంజనేయులుతో సంబంధం ప్రాణాలతో చెలగాటమని. తెలిసి గూడా మరెందుకు చేసింది? చెయ్యకుండా ఉండటం దుర్భరమై, చెయ్యటం "అవసరం" అయింది గనక. ఆంజనేయులు ఇన్ని సంవత్సరాల సర్వీసునూ, విశ్వాసాన్నీ, జయ కోసం వదులుకున్న దెందుకు. వదులుకోకపోతే, ఆ క్షణాన ఆధారం పోతుంది గనక—ఆ ఆధారం ఉండటం "అవసరం" గనక. చివరికి శేషావతారం గూడా పదిమందిలో తిరిగే "అవసరం" కోసమే జయను తెచ్చుకున్నాడు. మానవుడు, ఆనాడు, ఈనాడు, యిక ముందైనా సరే, ఇష్టంగా కానీ, అయిష్టంగా కానీ, మంచిదో, చెడ్డదో, ఒక పని చేశాడంటే, ఆ పని అతని అవసరమే చేయించిందనటం న్యాయం!